ఆదివారం ప్రత్యేకం

కొత్త బంగారు లోకం!





కొత్తబంగారు లోకం.. మీకు అవుతుంది సొంతం.. బంగారం కొనుగోలు చేయలేకపోతున్నామనే బాధెందుకు.. ప్రత్యామ్నాయం వచ్చేసిందండోయ్.. 24 క్యారెట్.. 22 క్యారెట్ బంగారు వస్తువులనే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు.. అచ్చంగా బంగారంలా కనిపించే వెండిపై గోల్డ్ కోటెడ్ ఆభరణాలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి.. అదీ కొనలేరా.. ఇమిటేషన్ జ్యూయలరీ ఉండనే ఉందిగా.. మన బడ్జెట్ మేరకు అందమైన వస్తువులను తీసుకోవచ్చు.. అలంకరించుకోవచ్చు.. మనసును కుదుటపరచవచ్చు.. అదీ కాదంటారా.. ఒక ఏడాది ఆగారంటే.. ఏకంగా తులం రూ.20 వేలకే అచ్చంగా స్వచ్ఛమైన బంగారం కొనేయ వచ్చు.. అదెలాగంటారా.. సామాన్యులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం 9 క్యారెట్ గోల్డ్ అందుబాటులోకి తీసుకురానుంది.. ధర తులం రూ.20 వేల ఉండొచ్చని అంచనా.. ఇంకెం దుకు ఆలస్యం ఏ బంగారం కొంటారో ఆలోచించుకోండి మరి!

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/
(రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

మెరిసేదంతా బంగారం కాదండోయ్..

ఎంత కొన్నా ఇంకా ఇంకా కొనాలనిపించేది బంగారం.. మోజు తగ్గదు.. ఆకర్షణ ఆగదు.. ఆ మెరుపునకు చిక్కితే ఇక అంతే. ఎంతున్నా ఇంకా ఇంకా కావాలని పిస్తూనే ఉంటుంది..మహిళలకైతే పసిడి అంటే మహాపిచ్చి. ధనవంతులకైతే ఇదో స్టేటస్ సింబల్.. పేదోళ్లకు అత్యవస రానికి ఆదుకునే వస్తువు..ఒక రకంగా చెప్పాలంటే పసిడి సురక్షిత పెట్టుబడి సాధనం.. ఇం

1963లో 24 క్యారెట్స్ తులం బంగారం రూ.63.25

1964	రూ.63.25
1970	రూ.184
1980	రూ.1,330
1990	రూ.3,200
2000	రూ.4,400
2010	రూ.18,500
2020	రూ.48,651
2024	రూ.75,640

'తరుగ'ని దోపిడీ.. మజూరీతో బేజారు

బంగారం వస్తువులు, ఆభరణాల కొనుగోలులో కాస్త మాయ ఉంటుంది. తరుగు, మజూరీలో కొందరు వర్తకులు ఎంతో కొంత బురిడీ కొట్టిస్తుంటారు.నగిషీలు ఎక్కువగా కావాలంటే తరుగు కూడా ఆ పరిమాణంలోనే ఉంటుంది. ఇవాళ 5 నుంచి 25శాతం వరకూ కూడా తరుగు వేస్తున్నారు. జిగేల్‌మనే పగడాలతో, కళ్లు మిరుమిట్లు గొలిపే రాళ్లతో, ఆకట్టుకునే రంగులతో ఉన్న వస్తువుల్లో బంగారం ఎంత ఉందో చెప్పడం కష్టం. ఇదే అదనుగా వీటిలో భారీ దోపిడీ జరుగుతోంది. ఎక్కువగా బరువు ఉండే రాళ్లు, ముత్యా లు వంటి వాటిని వాడి కొందరు వ్యాపారులు దోచేస్తున్నారు.

సామాన్యుడికి బంగారం లాంటి కబురు..

9 క్యారెట్ వస్తోంది..



ఒకపక్క బంగారం ధరలు భారీగా పెరిగి పోతూ సామాన్యుడు కొనుగోలు చేసే పరిస్థితి లేక పోయింది. మరోపక్క బంగారం విలువ అధికంగా ఉండడంతో వీటిని ధరించే మహిళలపై రోజు రోజుకు నేరాలు పెరిగి పోతున్నాయి.ఒంటిపై ఉన్న ఆభరణాలు తస్కరించడం, కొన్నిసార్లు చంపేసి లాక్కుపోతున్న పరిస్థితులు పెరిగి పోతుండడంతో కొత్తగా 9 క్యారెట్ బంగారు ఆభరణా లను దించాలని కేంద్రం ఆలోచి స్తోంది. ఇది వచ్చే ఏడాదిలోగా కార్యరూపం దాల్చే అవకాశం ఉంది.వాస్తవానికి ఇప్పుడు ప్రతిఒక్కరూ 22 క్యారెట్ విభాగం లో 916 హాల్ మార్క్ ఆభరణాలే వినియోగిస్తున్నారు. ఇందు లో 91.67 శాతం బంగారం ప్యూరిటీ ఉంటుంది. 8.33 శాతం కాపర్, సిల్వర్ కలుపుతారు. 22 క్యారెట్ల బంగారం గ్రాము ప్రస్తుతం రూ.7,100కు ఎగబాకి కొనలేని పరిస్థితులు తలెత్తా యి.దీంతో కొత్తగా 9 క్యారెట్‌తో బంగారు ఆభరణాలను కేంద్రం దించబోతోంది.ఇందులో బంగారం కేవలం 37.5 శాతమే ఉంటుంది. 42.5 శాతం సిల్వర్, 20 శాతం కాపర్ ఉంటుంది. ఇతర లోహాలు ఎక్కువ మోతాదులో కలపడం వల్ల 9 క్యారె ట్ బంగారం ధర తులం రూ.20 వేలకే వచ్చేయనుంది. అంటే 22 క్యారెట్ అయితే తులం రూ.71 వేలు ఉంది. తద్వా రా 9 క్యారెట్ బంగారానికి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. 9 క్యారెట్‌లో పసిడి తక్కువగా కలుస్తుంది కాబట్టి అంతగా ఆకర్షణీయంగా కనిపించక పోవచ్చనే వాదన ఉంది. మరోపక్క చాలా మంది బంగారాన్ని పెట్టుబడి సాధనంగా చూస్తారు కాబట్టి దీనిపై ఎంతవరకు మొగ్గుచూపుతారనేది చూడాలి.

ట్లో ఆడపిల్ల ఉన్న తల్లిదం డ్రులైతే పిల్ల పెళ్లికి బంగారం కోసం ఎన్నో ఆశలు పెట్టుకుం టారు..ముందునుంచే కొంచె కొంచెం కొని కూడబెడతారు. ఇప్పుడా పసిడి పట్టపగ్గాల్లే కుండా పరుగెడుతోంది. రెండు నెల ల కిందట తగ్గినట్లే తగ్గి ఇప్పుడు ఆల్‌టైం హై రేటుకు ఎగబా కింది.దీంతో జిల్లాలో పసిడి అమ్మకాలు గణనీయంగా తగ్గిపో యాయి.ఈ తరుణం లో కేంద్రం కొత్తగా తేవాలనుకుంటోన్న 9 క్యారెట్ గోల్డ్‌పై సామాన్యులు ఆశలు పెంచుకున్నారు. మరి కొందరు పసిడి ప్రియులైతే పెరిగిన ధరలు భరించ లేక గోల్డ్ కోటెడ్ ఉన్న సిల్వర్ ఆభరణాలు కొంటున్నారు.అసలు బంగారు ఆభరణాలకంటే రెట్టింపు డిజైన్లు దొరుకుతున్నాయి. దీంతో వీటిని కొంటుండడంతో ఈ వ్యాపారం జోరందుకుంది.

తగ్గి పెరిగిన ధర..

కేంద్రప్రభుత్వం జూలైలో పసిడిపై కస్టమ్స్ ట్యాక్స్ తగ్గించ డంతో ధరలు ఒక్కసారిగా తగ్గాయి. గ్రాము రూ.6,900 నుంచి క్రమేపీ రూ.6,300 వరకు పడిపోయింది.దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్కసారిగా కొనుగోళ్లు పెరిగాయి. ఒక్క వారంలో కొనుగోళ్లు రూ.550కోట్ల వరకు జరిగాయి. బంగారం కొనుగోళ్లకు సంబంధించి వార్షిక ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఏకంగా రూ.800కోట్ల వరకు వెళ్లాయి. అయితే గత నెలరోజులుగా బంగారం పరుగు పెడుతూనే ఉంది. రెండు రోజుల కిందట శుక్రవారం 22 క్యారెట్ల బంగారం ఏకంగా రూ.7,100 వరకు ఎగబాకింది. అటు ఆల్‌టైం గరిష్టానికి ధరలు పెరగ డంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొను గోళ్లు సగానికి సగం పడిపోయాయి.

సగానికి పడిపోయిన అమ్మకాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1,200 వరకు బంగారు ఆభరణాల విక్రయ దుకాణాలున్నాయి. ఇందులో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, మండపేట, పెద్దాపురం పట్టణాల్లో అధికంగా ఉన్నాయి. వీటన్నింటిలో రోజుకు ధరలు తగ్గిన సమయంలో రూ.40 కోట్ల వరకు అమ్మకాలు జరిగేవి. సగటున ఒక్కో దుకాణం రోజుకు 225 గ్రాముల వరకు విక్రయించేవి. ఇప్పుడు రోజువారీ విక్రయాలు రూ.22 కోట్లకు పడిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్ బంగారం దుకాణాలు అన్ని బ్రాంచ్‌లు కలిపి 50 వరకు ఉన్నాయి. వీటిలో సీజన్ సమయంలో రోజుకు రూ.55 కోట్ల వరకు విక్రయాలు జరిగేవి. ఇప్పుడు ధరాభారంతో రూ.33 కోట్ల వరకు జరుగుతున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పసిడి వర్తక సంఘం విశ్లేషించింది.

- బంగారం ధర దూకుడు
- రోజురోజుకు పెరుగుదల
- పడిపోయిన అమ్మకాలు
- ఉమ్మడి తూర్పున 1,200 దుకాణాలు
- 50కిపైగా కార్పొరేట్ బ్రాంచ్‌లు
- నాడు రోజుకు రూ.40 కోట్ల విక్రయాలు
- ఇప్పుడు రూ.22 కోట్లే
- త్వరలో కేంద్రం 9 క్యారెట్ ఆభరణాలు
- తులం రూ.20వేలకే బంగారం
- సామాన్యుల్లో కొంగొత్త ఆశలు
- బంగారం కోటెడ్ సిల్వర్ ఆభరణాలకు క్రేజ్
- ఇమిటేషన్ జ్యూయలరీకి డిమాండ్



సిల్వర్‌తో ధగధగలు..



గోల్డ్ కోటింగ్‌తో కూడిన సిల్వర్ ఆభరణాలు ఈ మధ్య మార్కెట్లో భారీగా దొరుకుతున్నాయి. గోల్డ్ కోటింగ్‌లా అసలే మాత్రం కనిపించకుండా అచ్చంగా బంగారు ఆభరణాల్లాగే ఉంటున్నాయి. గాజులు, నెక్లెస్, వడ్డాణం, చెవి రింగులు ఒక టేంటి అసలు బంగారు ఆభరణాల కంటే వీటిలోనే వందల కొద్దీ మోడళ్లు లభ్యమవుతున్నాయి. ధరిస్తే అసలు బంగారం లాగే ఇవి నిగనిగలాడుతాయి. పైగా వీటిని కొనుగోలు చేస్తే ఏడాది లేదా ఒక నెలలోనే తిరిగి అదే దుకాణానికి ఇచ్చేస్తే కొనుగోలు ధరలో 55 శాతం బైబ్యాక్ ఆభరణాల రూపంలో ఇస్తున్నారు. అనేక దుకాణాల్లో ఇదే విధానం అమలవుతోంది. దీంతో నచ్చిన ఆభరణాలను మహిళలు కొనుగోలు చేసి తిరిగి కొద్దినెలలకే అవి వెనక్కు ఇచ్చి కొత్తవి తీసుకుంటున్నారు. తద్వారా పసిడి ధరల పెరుగుదల భారం నుంచి బయట పడుతున్నారు. కాకినాడలో త్వరలో గోల్డ్‌కోటెడ్ సిల్వర్ ఆభరణాలు విక్రయించడానికి ఓ కార్పొరేట్ కంపెనీ షోరూం కూడా ప్రారంభించబోతోంది. 22 క్యారెట్ ఆభరణాల దగ్గర నుంచి వన్‌గ్రాం గోల్డ్, గోల్డ్‌కోటెడ్ సిల్వర్ ఆభరణాలు సైతం భారీగా ఆన్‌లైన్‌లో లభ్యమవుతున్నాయి. అనేక మంది మహిళలు ఆన్‌లైన్ ఆర్డర్ ద్వారా రప్పిస్తున్నారు. ఈ మార్కెట్ జిల్లాలో రూ.25కోట్ల వరకు ఉంటుందని అంచనా.

బంగారం ఎలా వస్తుందో తెలుసా..?

- ఆభరణాల తయారీకి బంగారం ఎక్కడినుంచి వస్తోందా తెలుసా? ప్రముఖ కార్పొరేట్ కంపెనీలైనా, చిన్న దుకాణాలైనా కచ్చితంగా బంగారం బిస్కెట్ కొని వీటి నుంచి ఆభరణాలు తయారు చేస్తాయి. నేరుగా విదేశాల నుంచి ఈ బిస్కెట్లు తేవడానికి లేదు. బ్యాంకుల ద్వారా మాత్రమే బిస్కెట్లు, కడ్డీలు కొనుగోలు చేయాలి. జిల్లాలో అనేక కంపెనీలు బ్యాంకుల నుంచి అరకిలో, కిలో 24 క్యారెట్ బిస్కె ట్లు కొంటాయి.కేంద్రప్రభుత్వ పరిధిలోని ఎంఎంటీసీ అనే సంస్థ నేరుగా విదేశాల నుంచి బంగారం బిస్కెట్లు, నాణేలు కొని బయట విక్రయిస్తుంది. ఎంఎంటీసీ నుంచి ఎవరైనా వీటిని కొనుగోలు చేసుకోవచ్చు.
- బంగారం మెత్తగా ఉండి బాగా సాగే గుణం కలిగి ఉంటుంది.వెంట్రుక కంటే సన్నగా సాగదీసినా గట్టిదనం తగ్గదు.ఒక ఔన్సు బంగారాన్ని 300 చదరపు అడుగుల రేకుగా సాగదీయవచ్చు. ఒక గ్రాము బంగారాన్ని ఒక చదరపు మీటరు వైశాల్యం కలిగిన రేకుగా లేదా 20 మైక్రో మీటర్ల మందం ఉన్న 165 మీటర్ల పొడవాటి తీగలా చేయవచ్చు.
- బంగారాన్ని నాణేలు, వస్తువులు, ఆభరణాలు తయారు చేయడం దగ్గర నుంచీ వాడకం విపరీతంగా పెరిగింది. 1930 నుంచి నాణేల చలామణీని ఆపేశారు.
- 2012 నాటికి ప్రపంచంలో 2లక్షల టన్నుల బంగారం ఉత్పత్తి జరిగింది.
- బంగారం స్వచ్ఛతను ఫెన్నీస్ లేదా క్యారెట్లలో కొలుస్తారు.బరువును ట్రాయ్ ఔన్సుల్లో లెక్కిస్తారు.ఒక ట్రాయ్ ఔన్సు అంటే మన పరిభాషలో కిలోన్నర బంగారం.
- బంగారపు దారాలను దుస్తుల ఎంబ్రాయిడరీకి వినియోగిస్తారు.టీవీలు,కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల్లో స్వల్పంగా బంగారాన్ని ఉపయోగించవచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేసింది.
- బంగారంలో 24 క్యారెట్స్ ప్యూరిటీ కాగా ఆభరణాల తయారీలో 22 క్యారెట్స్ వినియోగిస్తారు. ఏ ఆభరణమైనా 22 క్యారెట్ ప్యూరిటీ గోల్డ్‌తో మాత్రమే తయారు చేస్తారు. 18 క్యారెట్ బంగారం కూడా ఉంది. డైమండ్స్ తయారీలో ఈ బంగారాన్ని ఉపయోగిస్తారు. త్వరలో 9 క్యారెట్ బంగారం అందుబాటులోకి రానుంది.అదే వస్తే ధరలు తగ్గుతాయి.



అచ్చంగా బంగారమే..

ఒకపక్క పసిడి కొనలేనంతగా పెరగడంతో ఉమ్మడి జిల్లాలో మహిళలు వన్ గ్రాం గోల్డ్‌తో తయారు చేసిన ఇమిటేషన్ ఆభరణాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. రోజువారీగా ధరించడానికి నల్లపూసలు, గాజులు తదితర వన్ గ్రాం ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వస్తువులకు మహా డిమాండ్ ఉంది. ప్రస్తతం ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక వన్‌గ్రాం గోల్డ్ షోరూమ్‌లు వెలుస్తున్నా యంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరకు పెళ్లిళ్లు, పుట్టినరోజుల వేడుకల్లోను బహుమతుల కింద ఈ ఆభరణాలే ఇస్తున్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 28: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం మండలస్థాయిలో పిఠాపురం మండలం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫంక్షన్‌హాల్, రథాలపేట పిఠాపురంలో 30న సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ శనివారం ఒకప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లో నిర్వహిస్తామన్నారు.

ఉప రవాణా కమిషనర్ బాధ్యతల స్వీకరణ

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 28: కాకినాడ జిల్లా ఉపరవాణా కమిషనర్‌గా కె.శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఆర్టీవోగా జీవీ శివారెడ్డి కూడా బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా నుంచి ఆయన బదిలీపై వచ్చారు.

కాకినాడలో ఐదుగురు దొంగల అరెస్టు

వినియోదారుని మోసగించిన 'యాపిల్'కు జరిమానా

- నష్టపరిహారంతోపాటు ఏపీసీఎంఆర్‌ఎఫ్‌కు లక్ష చెల్లించాలని ఆదేశించిన కాకినాడ వినియోగదారుల ఫోరమ్

'ఏలేరు' భయం

- ఏలేరు రిజర్వాయర్ నుంచి కాలువల్లోకి 5,350 క్యూసెక్కుల వరద నీరు విడుదల
- కాలువల్లో పెరుగుతున్న వరద ఉధృతి
- గొల్లప్రోలు, పిఠాపురంలో పంటపొలాలు మునక

పిఠాపురం/గొల్లప్రోలు/ఏలేశ్వరం, సెప్టెంబరు 28: ఏలేరు వరద ఉధృతి మరింత పెరిగింది. కాలువలన్నీ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద నీరు గండ్లు నుంచి ప్రవహిస్తుండడంతో పలుచోట్ల పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. ఏలేరు రిజర్వాయర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్న నేపథ్యంలో వరద జలాల విడుదలను కొనసాగించారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 5,118 క్యూసెక్కుల నీరు వస్తుండగా దిగువకు 5,350 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాలువలకు 4,500 క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా విశాఖ తాగునీటి అవసరాలకు 250 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 86.52మీటర్లు ఉండగా, 22.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గరిష్ఠ నీటిమట్టం 86.56మీటర్లు కాగా 24.11 టీఎంసీల వరకూ నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. శుక్రవారం కంటే ఇన్‌ఫ్లోస్ పెరిగాయి. ఏజెన్సీ, క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు అధికంగా పడితే వరద జలాలు విడుదలను పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కాలువలకు వరద నీటి విడుదలతో గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడికక్కడ కాలువలన్నీ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరదల కారణంగా కాలువలకు పడిన గండ్లను పూడ్చకపోవడంతో వీటినుంచి వరద నీరు పంటపొలాలును ముంచెత్తుతోంది. పిఠాపురం బైపాస్‌రోడ్డు, గొల్లప్రోలు-పిఠాపురం మధ్య రైల్వేట్రాక్ చేర్చి ఉన్న పొలాలు, పిడింటొడ్డి రెగ్యులేటర్ సమీపంలోని పంట పొలాలు వరద ముంపునకు గురయ్యాయి.



పిఠాపురం బైపాస్‌రోడ్డులో వరద నీట మునిగిన పంటపొలాలు

కలవరపెడుతున్న సుద్దగడ్డ వరద

గొల్లప్రోలు, సెప్టెంబరు 28: సుద్దగడ్డ వరద కలవరపెడుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు ఆగకపోవడంతో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ(కొండ) కాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వరద నీరు గొల్లప్రోలు జగనన్న కాలనీకి వెళ్లే రహదారి పైకి చేరింది. శనివారం నాలుగున్నర నాలుగు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు, కాలనీవాసులు వరదనీరు దాటేందుకు వీలు లేక ప్రత్యామ్నాయంగా పంటపొలాల గట్లపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలతో పొలాల గట్లు అన్నీ నానిపోయి జారిపోతున్నాయి. దీంతో చిన్నారులను తల్లిదండ్రులే ఎత్తుకుని దాటిస్తున్నారు. పట్టణ శివారు సూరంపేట చుట్టూ వరద నీరు చేరుతోంది. గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపై స్వల్పంగా వరద నీరు ప్రహిస్తోంది.

రేపు రాష్ట్రస్థాయి సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డీఈవో రమేష్, డీసీఈబీ వెంకట్రావు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 28: కాకినాడ జేఎన్టీయూకే అలూమ్నీ ఆడిటోరియంలో సోమవారం ఏపీశాస్త్రసాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ, జేఎన్టీయూకే సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్‌బోధనలో నూతన పోకడలు, ఆవిష్కరణలు అనే అంశంపై రాష్ట్రస్థాయి సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను డీఈవో పి.రమేష్ శనివారం విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సమన్వయకర్తలు, కాకినాడ జిల్లానుంచి భౌతిక, జీవ శాస్త్ర ఉపాధ్యాయులు 330మంది పాల్గొంటారని తెలిపారు. గోడపత్రిక ఆవిష్కరణలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి వి.వెంకట్రావు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, ఏఎంవో వెంకట రామిరెడ్డి, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుక్కకాటును నిర్లక్ష్యం చేయవద్దు: జీజీహెచ్ సూపరింటెండెంట్

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 28: కుక్కకాటును నిర్లక్ష్యం చేస్తే పర్యావసానం ర్యాబిస్‌గా మారి మరణానికి కారణమవుతుందని కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అన్నారు. వరల్డ్ ర్యాబిస్ డే సందర్భంగా జీజీహెచ్ పరిపాలన విభాగసెమినార్ హాల్లో ఆస్పత్రికి కుక్క కరిచి వచ్చిన బాధితులకు, రోగుల బంధువులకు శనివారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ వీధికుక్కలు విస్తారంగా వృద్ధి చెంది విచ్చలవిడిగా రోడ్లపై తిరుగుతూ పిల్లలపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయన్నారు. ప్రమాదవశాత్తూ కుక్క కరిస్తే వెంటనే గాయమైన భాగంలో సబ్బుతో పదినిమిషాలపాటు నిరంతరంగా కడగాలన్నారు. ప్రభుత్వాస్పత్రికి వెళ్తే తొలుత టీటీ ఇంజక్షన్‌తోపాటు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌ను నాలుగు డోసులుగా ఇస్తారన్నారు. కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయకుండా ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకుని ప్రాణాలను సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కాకినాడ రాజీవ్‌గాంధీ నగరపాలక సంస్థ హైస్కూల్‌లో విద్యార్థులకు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ర్యాబిస్‌పై వచ్చే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపిడమాలజిస్ట్ డాక్టర్ బండారు రవికుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ప్రిన్సిపాల్ రాజు, డెమో ప్రసాదరాజు పాల్గొన్నారు.

సమాజంలో ఫోరెన్సిక్ సైన్స్ కీలకం: డీఎంఈ డాక్టర్ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 28: సమాజంలో ఫోరెన్సిక్ సైన్స్ అత్యంత కీలకమైనదని డీఎంఈ, ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ, కాకినాడ రంగరాయ వైద్యకళాశాల(ఆర్‌ఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. ఆర్‌ఎంసీ ఆడిటోరియంలో మూడురోజులపాటు నిర్వహించిన సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్(సిమ్లా) నిర్వహించిన సెమినార్‌కు ముగింపు రోజైన శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిమ్లా ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.ఫణికిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నరసింహం మాట్లాడుతూ ఫోరెన్సిక్ మెడిసన్ అండ్ టాక్సికాలజీ విభాగానికి, పోలీస్‌శాఖకు ఉన్న అనుబంధం విడదీయలేనిదన్నారు. గుర్తుపట్టలేని, విచ్ఛిన్నమైన, సాక్ష్యాలులేని కేసుల్లోని మృతదేహాల విషయంలో ఫోరెన్సిక్ మెడిసన్ అత్యంత కీలకమైనదన్నారు. సెమినార్‌లో వైద్యులు, వైద్యవిద్యార్థులకు నిర్వహించిన పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, సైంటిఫిక్ సెషన్స్, క్విజ్ పోటీల్లో పాల్గొన్ని విజేతలుగా నిలిచిన వారికి డీఎంఈ బహుమతి ప్రదానం చేశారు. సదస్సులో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ శశి, అబ్జర్వర్ డాక్టర్ రంగారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీష్, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 500మంది వైద్యులు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

టిడ్కో గృహాలపై త్వరలో శ్వేతపత్రం: ఏపీ టిడ్కో చైర్మన్ అజయకుమార్

పిఠాపురం, సెప్టెంబరు 28: టిడ్కో అపార్ట్‌మెంట్ల స్థితిగతులపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్ వెల్లడించారు. పిఠాపురం పట్టణంలోని గోర్స రోడ్డులో టిడ్కో అపార్ట్‌మెంట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సమస్యల గురించి అపార్ట్‌మెంట్ వాసులు ఏకరవుపెట్టారు. అనంతరం అజయకుమార్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ నగరాలు, పట్టణాల్లో ఉన్న టిడ్కో గృహాల పరిస్థితిపై శ్వేతపత్రం రూపొందిస్తున్నామన్నారు. టిడ్కో చైర్మన్‌గా నియమితులైన వెంటనే పిఠాపురం వచ్చానని, ఇక్కడకు రాగానే సమస్యలు వెల్లువలా వచ్చాయని తెలిపారు. నిర్మాణంలో లోపాలన్నాయని, అపార్ట్‌మెంట్లు సిద్ధమైనా ఏళ్ల తరబడి లబ్ధిదారులకు అప్పగించలేదని, అప్పగించిన తర్వాత ఇక్కడ అన్ని సమస్యలు ఉన్నాయని అక్కడ నివాసముంటున్నవారు వివరించారని చెప్పారు. ఇక్కడ పనులు చేసిన కాంట్రాక్టర్‌ను పిలిపించి అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆయన వెంట జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కమిషనరు కనకారావు ఉన్నారు.



అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న అజయకుమార్





గుప్పెడంత గుండెకు... ఉప్పెనంత ఒత్తిడి?

» యువతలోనూ పెరుగుతున్న గుండెపోటు కేసులు » నేడు వరల్డ్ హార్ట్ డే

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28:

ఇది వరకు కాలంలో గుండెపోటు కేసులు పెద్దవారిలో మాత్రమే కనిపించేవి. నేటి ఆధునిక కాలంలో యువతలో కూడా గుండెపోటు కేసులు పెరుగుతున్నాయి. గుప్పెడంత గుండెకు ఉప్పెనంత ఒత్తిడి కలిగిస్తున్నాయి. బీపీ, షుగర్, ధూమపానం వంటి అలవాట్లు లేకపోయినా కూడా గుండె జబ్బులు వస్తాయా? అంటే అవుననే చెప్తున్నారు కార్డియాలజిస్టులు. మానసిక ఒత్తిడి, ఆందోళన గుండె జబ్బులకు దారి తీస్తాయని హెచ్చరిస్తున్నారు.

ఆధునిక జీవితంలో యువతలో మానసిక ఒత్తిడి, సామాజిక ఒత్తిడి పెరిగింది. శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పటికీ మానసిక ఆందోళన వల్ల జన్యుపరమైన మార్పులు జరిగి రక్తప్రసరణలో తేడాలతో రక్తం చిక్కబడడం, రక్తనాళాల్లో మార్పులు చోటుచేసుకుని హార్ట్ ఎటాక్‌కు దారి తీస్తోంది.

ధూమపానం, మత్తు పదార్థాలు, ఊబకాయం, మానసిక ఒత్తిడి, అధిక కొలెస్ట్రాల్, పోస్ట్ కొవిడ్ వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి. అంతే కాకుండా వాయు, శబ్ద కాలుష్యం, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, ఆధునిక ఆహారపు అలవాట్లు గుండె జబ్బులకు దారితీస్తాయి.

ముందుగా గుర్తించడం ఎలా? ఏం చేయాలి?

గుండె జబ్బులను ముందుగా గుర్తించాలంటే... రెగ్యులర్ హెల్త్ చెకప్ అవసరం. బీపీ 120/80, ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ 100లోపు, టోటల్ కొలెస్ట్రాల్ 200లోపు, ఎఫ్‌బీఎస్ 110లోపు, బీఎంఐ 23.5-25.0గా ఉండాలి. గుండె సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే స్పెషలిస్టు డాక్టర్‌ను సంప్రదించాలి. ఆందోళన తగ్గించుకోవాలి. యోగా, మెడిటేషన్, వ్యాయామం, సంగీతం వినడం, మానసికోల్లాసం కోసం కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉత్సాహంగా గడపడం అలవర్చుకోవాలి.

ముందుగా గుర్తిస్తే ముప్పు తప్పుతుంది



డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్
పల్స్ హాస్పటల్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్

పెద్దవారైనా, యువత అయినా గుండె జబ్బులను ముందుగా గుర్తిస్తే ప్రాణపాయం నుంచి బయటపడొచ్చు. రెగ్యులర్ హెల్త్ చెకప్ తప్పనిసరిగా చేయించుకోవాలి. ఏమాత్రం లక్షణాలు కనిపించినా అశ్రద్ధ చేయకుండా స్పెషలిస్ట్ డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

శ్రీనివాసా గోవిందా... శ్రీవేంకటేశా గోవిందా

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.28.30 లక్షలు



ఆత్రేయపురం, సెప్టెంబరు 28: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాల భోగం శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.28.30 లక్షలు లభించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో చక్రధరరావు తెలిపారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఇందుకూరి సుబ్బలక్ష్మి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


కోరుకొండ లక్ష్మీనరసింహస్వామికి రూ.2.70 లక్షలు విలువైన

బంగారు కిరీటం బహూకరణ



ఈవో రామచంద్రమోహన్‌కి కిరీటం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 28: అన్నవరం దత్తత ఆలయం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన బి.ఆది నారాయణమూర్తి బంగారు కిరీటం బహూకరించారు. దీనిని దాత ఈవో రామచంద్రమోహన్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించారు. దీని విలువ సుమారు రూ.2.70 లక్షలు అని దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కొండలరావు, డీఈ రాంబాబు, కోరుకొండ ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



దివాన్‌చెరువులో...

ఎక్కడుందో!



కడియంలో...

» తొలుత దివాన్‌చెరువు పుష్కర వనంలో
» అక్కడి నుంచి కడియం వనాల్లోకి
» బెదిరిపోవడమే కారణమా!
» 25 రోజులుగా సంచారం
» అటవీ శాఖ అధికారులకు చిక్కని వైనం
» వదంతులతో భయం భయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వనంలోంచి జనారణ్యంలోకి వెళ్లిన చిరుత అయోమయంగా తిరుగుతున్నట్టు తెలుస్తోంది. వన్యమృగాలు అడవులను వీడి రావడానికి ఇష్టపడవు. కానీ చిరుత పులి ఆహార వేటలో ఇటుగా వచ్చేసింది. చిరుతలు సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకూ 'జంట' కట్టే సమయం. అలా వెతుకులాటలో కూడా అడవి నుంచి తప్పిపోయి ఉండొచ్చు. దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో తొలిగా ఈ నెల 6వ తేదీన దాని అడుగులను గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగిన అటవీ అధికారులు గాలింపు మొదలుపెట్టారు. ఒకవైపు ప్రజలను అప్రమత్తం చేస్తూనే.. పులిని బంధించడానికి అవసరమైన ఏర్పాటు చేశారు. కానీ ట్రాప్ కెమెరాలకు తప్ప బోనుకు చిక్కకుండా చిరుత తిరుగుతోంది. 19వ తేదీ రాత్రి చివరిగా దివాన్‌చెరువు అభయారణ్యంలో చిరుత జాడ కనిపించింది. తర్వాత మూడు రోజులు ఏ అలికిడీ లేదు. 24వ తేదీ రాత్రి 8గంటల సమయంలో కడియపులంకలోని లక్ష్మణస్వామి నర్సరీలో చిరుత అడుగులు కనిపించాయి. అక్కడ ఇళ్ల సమీపం వరకు వెళ్లి వెనుదిరిగింది. బహుశా మేకలు, కోళ్లు వంటివి లేకపోవడంతో వెనక్కు మళ్లిందని అంచనా వేస్తున్నారు. ఆ ప్రాంతంలో 40 ట్రాప్ కెమెరాలు, 4 బోనులు ఏర్పాటు చేశారు. బోన్లు, వాటి బయట ఎనిమిదిచోట్ల మేక పిల్లలను ఉంచారు. కానీ ఈనాటికీ ఫలితం లేకపోయింది. ప్రధానంగా వర్షం అటంకంగా మారింది.

వన్యప్రాణులు ఒకవేళ అడవి నుంచి బయటకు వచ్చేసినా మళ్లీ వాటంతటవే వెనక్కు మళ్లి వచ్చిన దారిన వెళ్లిపోతాయి. గతంలో ప్రత్తిపాడులో పెద్దపులి రెండు నెలలు సంచరించి అడవిలోకి వచ్చిన దారిలోనే వెళ్లిపోయింది. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుందని అనుకున్నారు. చిరుత లేదా పులి వచ్చే మార్గంలో మల, మూత్ర విసర్జన చేస్తుంది. వేటాడిన కళేబరాలు ఉంటాయి. వాటి వాసన ఆధారంగా అదే దారిలో అడవిలోకి వెళ్లిపోతుంది. కానీ వర్షాలు రావడంతో ఆ అవకావం కూడా లేకుండా పోయింది. శనివారం వాతావరణం కాస్త తెరిపిచ్చింది. ఎండ రావడంతో చిరుత ఆనవాళ్లు దొరికే అవకాశం కనిపిస్తోంది.

వదంతులతో భయం...

మనుషులకు చిరుత అంటే ఎంత భయమో.. చిరుతకు కూడా మనుషులంటే అంతే భయం. ప్రస్తుతం చిరుత తన గూడుకు చేరుకునే ప్రయత్నంలో ఉంది. ఈ సమయంలో అయోమయానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. చిరుత ఊళ్లోకి రాకుండా శబ్దాలు చేస్తున్నారు. అయితే దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు నుంచి ఆ శబ్ధాల వల్లే వల్ల అయోమయానికి గురై కడియపులంక దిశగా ప్రయాణించినట్టు తెలుస్తోంది. ఆ రోజు సాయంత్రం అభయారణ్యంలోని ఫారెస్టు అకాడమీ ప్రాంతం నుంచి జాతీయ రహదారి దాటి పుష్కర వనం వైపు వచ్చింది. వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా పెద్ద పెద్ద డీజే శబ్దాలు, బాణసంచా కాల్చడం వల్ల ఎటుపోవాలో తెలియని పరిస్థితుల్లో రిజర్వు ఫారెస్టు దాటిందని అంచనా వేస్తున్నారు. ఈలోపు సోషల్ మీడియాలో విపరీతంగా వదంతులు ట్రోల్ అవుతున్నాయి. దీంతో మరింత భయం పట్టుకుంది. చిరుత కోసం ఏర్పాటు చేసిన బోన్ల వద్దకు మనుషులు వెళ్తున్నారు. సెల్ఫీలు కూడా తీసుకుంటున్నారు. దీంతో చిరుత అక్కడ ఉంచిన ఎరకేసి వచ్చే అవకాశాలు తగ్గుతున్నాయి. చిరుత పులులు 200 మీటర్ల దూరంలోని వాసనను కూడా పసిగట్టగలవు. దీంతో బోన్ల వద్ద జనాల పాదముద్రలు, వాసన పసిగట్టి చిరుత ఆ వైపుగా రావట్లేదని అంచనా వేస్తున్నారు.

చిరుత జాడ మళ్లీ కనిపించలేదు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు



తూర్పు గోదావరి జిల్లా కడియపులంకలో 24వ తేదీ రాత్రి చిరుత అడుగులను చివరిగా గుర్తించామని.. తర్వాత దాని అలికిడి లేదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాదరావు వెల్లడించారు. చిరుత పులి సంచారంపై వదంతులు వస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆయన జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షం కారణంగా చిరుత అడుగు జాడలు కూడా నేలపై ఉండట్లేదని చెప్పారు. ట్రాప్, సీసీ కెమెరాల్లో కూడా చిరుత చిత్రాలు చిక్కలేదన్నారు. చొప్పెల్ల, కేశవరం, మండపేటల్లో కనిపించిదని వార్తలు రాగా వెంటనే తమ బృందాలు చేరుకున్నాయన్నారు. స్థానికులను ఆరా తీసి ఆ సమాచారాలను వదంతులుగా గుర్తించామన్నారు. మొత్తం పది బృందాలు రేయింబవళ్లు గస్తీ తిరుగుతున్నాయని చెప్పారు. చిరుతను బంధించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశామని, అన్ని చర్యలూ చేపడుతున్నామని ప్రసాదరావు వెల్లడించారు.

• జర జాగ్రత్త...



చిరుతను చూసి ఎట్టి పరిస్థితుల్లోనూ పరుగెత్తడం, కూర్చోవడం, తుప్పల్లో నక్కడం వంటివి చేయకూడదు. చేతులు పైకెత్తి కదలకుండా నిలబడాలి. చిరుతను గమనిస్తూ చాలా నెమ్మదిగా అడుగులు వెనక్కి వేస్తూ ఉండాలి. మరీ దగ్గరగా వస్తే చేతులు పైకెత్తి బిగ్గరగా అరవాలి. దాంతో పెద్ద జంతువుగా భావించి చిరుత వెనక్కి మళ్లే అవకాశం ఉంది. ఆరు బయట బహిర్భూమికి వెళ్లరాదు. గుంపులుగా తిరగడం శ్రేయస్కరం. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకే చిరుత సంచరిస్తోందని ట్రాప్ కెమెరాలకు చిక్కిన ఫొటోల ద్వారా తెలుస్తోంది. అందువల్ల ఆ సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండడం తప్పనిసరి.

• హాని చేస్తే జైలుకే...

చిరుత వన్యప్రాణి కాబట్టి చట్టాలు అత్యంత కఠినంగా ఉంటాయి. చిరుత కనిపిస్తే హాని చేయకుండా బంధించడం పార్వాలేదు. అయితే వెంటనే పోలీసులకు లేదా ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలి. అంతేగానీ కర్రలు, రాళ్లు వంటి వాటితో కొట్టడం, గాయపర్చడం, హతమార్చడం వంటివి చేస్తే మాత్రం వన్యప్రాణుల సంరక్షణ చట్టాల ప్రకారం ఏడేళ్ల వరకూ శిక్ష పడుతుంది. పైగా నాన్ బెయిలబుల్ కేసులు పెడతారు. అందువల్ల చిరుతను అయోమయానికి గురి చేయకుండా నడుచుకుంటే మంచిదని అటవీ శాఖ అధికారులు చెప్తున్నారు. చిరుత కనిపించిన వెంటనే ట్రాంక్విలైజ్.. అంటే మత్తు ఇంజక్షన్ ఇవ్వడం కుదరదు. దాని బరువు, వయసు అంచనా వేసి డోస్ ఇస్తారు. అది కూడా పులిని బంధించడానికి వలలు వగైరా ప్రయత్నాలు అయిన తర్వాత మాత్రమే చివరి ప్రయత్నంగా ట్రాంక్విలైజ్ చేయాల్సి ఉంటుంది. అందువల్ల చిరుతను పట్టుకునే విషయంలో ఫారెస్టు అధికారులు కూడా చాలా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.

కేటుగాళ్లు

» ఇళ్లను కొల్లగొట్టేవారు ముగ్గురు...
మోటారు సైకిళ్లను మాయం చేసేవారు ఇద్దరు
» కాకినాడలో ఐదుగురు నిందితుల అరెస్టు
» రూ. 34 లక్షలు విలువైన చోరీ సొత్తు స్వాధీనం
» వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్ (పైన) పోలీసులు పట్టుకున్న మోటారు సైకిళ్లు



కాకినాడ క్రైం, సెప్టెంబరు 28: గుట్టు చప్పుడు కాకుండా తాళాలు వేసి ఉన్న ఇళ్లను కొల్లగొట్టి అందినకాడికి లాగేస్తారు ముగ్గురు. తాళాలు వేసి ఉన్న మోటారు సైకిళ్లను మూడో కంటికి తెలియకుండా తస్కరిస్తారు మరో ఇద్దరు. ఈ తరహా దొంగతనాలకు పాల్పడుతున్న మొత్తం ఐదుగురిని కాకినాడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ వివరాలను వెల్లడించారు. ఇటీవల రాత్రిపూట నేరాలు, మోటారు సైకిళ్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఆదేశానుసారం అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు నేతృత్వంలో కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో రాత్రిపూట గస్తీని ముమ్మరం చేశారు. శుక్రవారం రాత్రి బృందాలుగా విడిపోయి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు రామకృష్ణారావు పేటలోని ఇసుకలేటి మోజెస్ అనే యువకుడి ఇంటి వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఏలూరు జిల్లా వంకాయగూడెం గాంధీ కాలనీ... ప్రస్తుతం (కాకినాడ రామకృష్ణారావుపేట)కు చెందిన పాత నేరస్తుడు 30 ఏళ్ళ ఇసుకలేటి మోజెస్. రాజమహేంద్రవరం గణేష్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు 41 ఏళ్ళ ఇసుకలేటి గాంధీ. రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌కు చెందిన 32 ఏళ్ళ తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్. వారు చేసిన నేరాలను అంగీకరించారు. కాగా నిందితులు తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్ ద్వారా వారు దొంగిలించిన చోరీ సొత్తును విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారు. నిందితుల నుంచి రూ.24.99 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు కొత్త కాకినాడ శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరని అదుపులోకి తీసుకుని విచారించారు. కాకినాడ రాగంపేటకు చెందిన పాత నేరస్తుడు 19 ఏళ్ళ కడగాల ఏసు. కొయ్యవారి వీధికి చెందిన 24 ఏళ్ళ గొర్రెల దుర్గాప్రసాద్ చేసిన నేరాలను అంగీకరించారు. నిందితులు కాకినాడ, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న మోటారు సైకిళ్లను మారు తాళాలతో తీసి తస్కరించి గొర్రెల దుర్గాప్రసాద్ ద్వారా విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సా చేసేవారు. నిందితులు ఐదుగురినీ చాకచక్యంగా పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణ, కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చెతన్యకృష్ణ, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, ఎస్ఐ వినయ్‌ప్రతాప్, క్రైం ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావు, ధనరాజ్, పుల్లయ్య, హెచ్‌సీలు గొప్పు చిన్న, వర్మ, సత్యమూర్తి, కానిస్టేబుళ్లు మౌళి, నాయుడు, ప్రసాద్, స్వామిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అడ్మిన్ ఎస్పీ భాస్కరరావు, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

పిఠాపురం, సెప్టెంబరు 28: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉండగా పిఠాపురానికి మినీ స్టేడియం మంజూరు చేయించి పనులు ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. త్వరలోనే దీనిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్-19 ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ, రగ్బీ జిల్లా పోటీలు నిర్వహించి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లను ఎంపిక చేశారు. 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా ఆర్చరీలో 24 మందిని, రగ్బీలో 24 మందిని ఎంపిక చేసినట్టు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను, రావుల రమేష్, కేతవరపు కృష్ణ, జనసేన నాయకులు సూరవరపు సురేష్, చెల్లుబోయిన సతీష్, మార్నీడి రంగబాబు, అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ శివరామకృష్ణ, రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, సీఈవో నాగలింగేశ్వరరావు, కోచ్ లక్ష్మణరావు పాల్గొనగా, న్యాయనిర్ణేతలుగా నవీన్, వంశీ, శివప్రసాద్, అఖిల్ వ్యవహరించారు.



పిఠాపురంలో ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

మావోయిస్టు వారోత్సవాలు ఎవరి కోసం?

వ్యతిరేకంగా వెలసిన వాల్ పోస్టర్లు



ఎటపాక, సెప్టెంబరు 28: ఎవరి కోసం ఈ మావోయిస్టు వారోత్సవాలు? గిరిజనులకు ఉపయోగపడని వారోత్సవాలు మాకొద్దు అంటూ మావోలకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శనివారం వాల్‌పోస్టర్లు వెలిశాయి. మండలంలోని విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై బండిరేవు, లక్ష్మీపురం, బాసవాగుతో పాటు భద్రాచలం-కూనవరం రోడ్‌లో నందిగామ, మురుమూరు గ్రామాల్లోని కల్వర్టులు, చెట్లకు పోస్టర్లను అతికించారు. అమాయక గిరిజనులను ఇన్ఫార్మర్ల నెపంతో చంపుతున్నారని, బస్సులను దహనం చేస్తూ గిరిజనులకు రవాణా సౌకర్యం లేకుండా చేస్తున్నారన్నారు. వారోత్సవాల ఉచ్చులో తమను లాగొద్దని, సభలు, సమావేశాలంటూ వేధించవద్దన్నారు. స్థూపాలు, కట్టడాలని మీ పాపాల్లో మమ్మల్ని పాలుపంచొద్దని పేర్కొన్నారు. మీదారికి రావాలని బెదిరించవద్దని, గిరిజనుల సహనం పరీక్షించవద్దన్నారు. కాగా మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్న తరుణంలో ఈ పోస్టర్లు వెలవడం చర్చనీయాంశంగా మారింది.

అన్నీ తానై...

తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

ఆలమూరు, సెప్టెంబరు 28: కుమారుడు లేని తండ్రికి అన్నీ తానేనని కుమార్తె ముందుకొచ్చి అంతిమ సంస్కారాలు జరిపింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరుకు చెందిన గన్ని అమ్మిరాజు (64) గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తె సీతా మహాలక్ష్మికి వివాహం కావడంతో అమెరికాలో స్థిర పడింది. తండ్రి మరణ వార్త తెలుసుకుని అక్కడి నుంచి బయల్దేరి శనివారం ఉదయ ఆలమూరు చేరుకుంది. తండ్రి అంత్యక్రియలు తానే చేయాలని నిర్ణయించుకుంది. ఆలమూరు గోదావరి ఏటిగట్టు వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికలో కర్మకాండలు జరిపి తలకొరివి పెట్టింది.



శృంగారవల్లభ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, సెప్టెంబరు 28: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతిలోని శృంగారవల్లభ స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వామివారికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,32,730 అన్నదాన విరాళాల ద్వారా రూ.62,915, కేశఖండన ద్వారా రూ.7,880, తులాభారం ద్వారా రూ.600, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.25,035... మొత్తం రూ.2,29,160 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

గ్రానైట్ ఫ్లోరింగ్ పనుల పరిశీలన

అన్నవరం, సెప్టెంబరు 28: సత్యదేవుడి ప్రధాన రాజగోపురం వద్ద చేపడుతున్న గ్రానైట్ ఫ్లోరింగ్ పనులను ఈవో రామచంద్రమోహన్ శనివారం పరిశీలించారు. గోపురం నుంచి అనివేటిమండపం వద్దకు వెళ్లే ప్రదేశంలో మెట్టును పెంచాలని సూచించారు. సాధారణ భక్తులు దర్బారుమండపం వద్ద దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు తీసుకునే ప్రదేశంలో ఫ్లోరింగ్ పై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఏదైనా చిన్నతడిఉంటే భక్తులు జారిపడిపోతారని దీనిని సరిచేయాలని డీఈలు ఉదయ్‌కుమార్, రాంబాబులకు సూచించారు.

పాదగయ ఈవోగా విశ్వనాథరాజు



పిఠాపురం, సెప్టెంబరు 28: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం సహాయ కమిషనరు, ఈవోగా విశ్వనాథరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. విశ్వనాథరాజును రాజమహేంద్రవరంలోని వీఎంకే సత్రం రెగ్యులర్ అసిస్టెంట్ కమిషనర్, ఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, పాదగయ ఈవో అదనపు బాధ్యతలు నిర్వర్తించాలని దేవదాశాఖ కమిషనరు ఆదేశాలు జారీ చేశారు. వీటికి అదనంగా తలుపులమ్మ తల్లి దేవస్థానం ఈవోగా, ఉపకమిషనరుగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ పాదగయ ఈవోగా సహాయ కమిషనరు అల్లు దుర్గాభవానీ పనిచేయగా ఆమెను ద్రాక్షారామ రెగ్యులర్ ఈవోగా బదిలీ చేశారు. శనివారం ఆమె విశ్వనాథరాజుకు బాధ్యతలు అప్పగించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని విశ్వనాథరాజు తెలిపారు.

టీడీపీ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి!

కాకినాడ సిటీ, సెప్టెంబరు 28: కాకినాడ రూరల్ వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో కరప మండలం యండమూరుకు చెందిన వైసీపీ నాయకుడు పలివెల జానకీరామయ్య టీడీపీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో కలసి కూర్చోవడంపై పలువురు నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. వైసీపీకి రాజీనామా చేయకుండా మీటింగ్‌కి ఆహ్వానించడం, జెండా మోసినవారిని పక్కన పెట్టడంపై విస్మయం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్న నాయకుల తీరుపై పార్టీ అధిష్ఠానం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆటోనగర్‌వాసుల ఆందోళన

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 28: కాకినాడ రూరల్ సర్పవరం ఆటోనగర్‌లో వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలంటూ ఆటోనగర్ వాసులు శనివారం సర్పవరం- మాధపట్నం రోడ్డు వద్ద ఆందోళన నిర్వహించారు. ఏపీఐఐసీ జనరల్ మేనేజర్ వచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని రోడ్డుపై భీష్మించడంతో జీఎం రమణారెడ్డి వచ్చి చర్చించారు. ముంపు సమస్యను కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రామలింగరాజు, గుత్తుల వీర్రాజు, లంకే రాములు పాల్గొన్నారు.

ముగిసిన మెకానికల్ విభాగ వర్క్‌షాప్

జేఎన్టీయూకే, సెప్టెంబరు 28: వర్శిటీలోని మెకానికల్ విభాగ సెమినార్ హాల్లో ఆ విభాగం ఆధ్వర్యంలో 3 రోజుల నుంచి నిర్వహిస్తున్న అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని డీఎంఆర్ఎల్ మాజీ డైరెక్టర్, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.మధుసూదనరెడ్డి, విశిష్ట అతిథులుగా వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ జీవీఎస్ఆర్ దీక్షితులు, స్వరూపారాణి పాల్గొనగా డాక్టర్ డి.లింగరాజు అధ్యక్షత వహించారు. అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లకు, ఎంటెక్ విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అతిథులు అందజేశారు. ప్రొఫెసర్లు మహేష్‌కుమార్, కిషోర్‌బాబు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, విద్యార్థులు ఉన్నారు.

'సీఎం ప్రకటన అభినందనీయం'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 28: అన్ని మతాల ప్రార్థనా మందిరాలకు రక్షణ కల్పించే చట్టం తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం అభినందనీయమని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా ప్రెసిడెంట్ పాస్టర్ మోసా అబ్రహం కృతజ్ఞతలు తెలిపారు. దుమ్ములపేటలోని విక్టరీ రివైవల్ సెంటర్‌లో శనివారం కౌన్సిల్ సిటీ ప్రెసిడెంట్ బిషప్ పి.రత్నబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ నాయకులు, పాస్టర్లు థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చశారు. సమావేశంలో కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ మోజేష్ కుమార్, జిల్లా చిల్డ్రన్ వింగ్ ప్రెసిడెంట్ కాశరపు సింహాద్రి, కౌన్సిల్ సిటీ సెక్రటరీ వనమాడి సుందర్, జాయింట్ సెక్రటరీ విజయకుమార్, ప్రేయర్ వింగ్ ప్రెసిడెంట్ సాల్మన్‌రాజు, ప్రొఫెషనల్ వింగ్ ప్రెసిడెంట్ ముని సుందర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో వైసీపీ నేతల పూజలు

పెద్దాపురం, సెప్టెంబరు 28: తిరుమల పవిత్రతకు చంద్రబాబు భంగం కలిగించారని నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయరు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కాపగంటి కామేశ్వరరావు, వాసంశెట్టి గంగ పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైసీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురామ్ జగ్గంపేట జడ్పీటీసీ ఒమ్మిబిందుమాధవితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ చెరుకూరి జయరాజు, ఆకుల శ్రీధర్, గొల్లపల్లి శ్రీను, ఒమ్మి లక్ష్మీదేజస్వీ, కొట్టు శివరామకృష్ణ, కీలపర్తి వీబాబు పాల్గొన్నారు.

పిఠాపురం: శ్రీవారి లడ్డూ విశిష్టతకు, తిరుమల పవిత్రతకు కూటమి నేతలు భంగం కలిగించారని.. ఈ పాపానికి ప్రాయశ్చిత్తంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించామని కాకినాడ మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. గీతతో పాటు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా పల్లేశ్వరరావు

సామర్లకోట, సెప్టెంబరు 28: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సామర్లకోట అధ్యక్షుడిగా ఆర్వీ పల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సామర్లకోట ప్రభుత్వ కళాశాల నందు కాకినాడ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్వీ.వీరభద్రస్వామి, ఎస్సెమ్ రామారావు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా సిద్దా సూర్యనారాయణ, కార్యదర్శిగా జీవీ.రాఘవ, కోశాధికారిగా ముష్టిన డేనియల్ వరప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా పత్యాల జాన్ కెన్నడీబాబు, ఎస్.సత్యం నాయుడు కార్యనిర్వాహక సభ్యులుగా బి.రాజేశ్వరిల ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరభద్రస్వామి, రామారావు అభినందించారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

పెద్దాపురం, సెప్టెంబరు 28: స్థానిక వర్థులవారి వీధిలో ఉన్న భువనేశ్వరీ పీఠంలో దేవీనవరాత్రి ఉత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. పట్టణానికి చెందిన వేముల సత్యసాయిప్రసాద్, అరుణ దంపతుల చేతులమీదుగా రాట ముహూర్తం నిర్వహించామని పీఠాధిపతి చింతా గోపీశర్మ సిద్ధాంతి తెలిపారు. వచ్చే నెల 12వరకూ ప్రత్యేక పూజలు జరుగుతాయని, భక్తులు 9866193557,8897554557లో సంప్రదించాలన్నారు.

పౌష్టికాహార మహోత్సవాలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 28: కాకినాడ నగరపాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం శనివారం స్థానిక భానుగుడి సెంటర్‌లో పాత మీసేవలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద ప్రారంభించారు. స్వయం సహాయక సంఘ సభ్యులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదార్థాలు తయారుచేసి సుమారు 50 రకాల వంటకాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో కె.శైలజ, సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 28: ప్రభుత్వ శాఖల్లో పని చేసే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను సర్వీసు ప్రాతిపదికన పర్మినెంట్ చేయాలని ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు పిలుపునిచ్చారు. చాలిచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యో గులు, కార్మికులను పక్క రాష్ట్రాలలో మాదిరి పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశార

జడ్పీ ఛైర్మన్‌ను కలిసిన సీఈవో లక్ష్మణరావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 28: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన వీవీఎస్ లక్ష్మణరావు శనివారం జిల్లాపరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని రాజమహేంద్రవరంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కాకినాడలో సైక్లాథాన్

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 28: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలో సైక్లాథాన్ కార్యక్రమం నిర్వహించారు. రాజా ట్యాంక్ నుంచి జేఎన్టీయూకే కళాశాల వరకు ఈ సైక్లాథాన్‌ను కమిషనర్ భావన జెండా ఊపి ప్రారంభించారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, విద్యార్థులున్నారు.

'మంచి ఆహారపు అలవాట్లతో గుండె పదిలం'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 28: మంచి ఆహారపు అలవాట్లతో గుండె వ్యాధులకు దూరంగా ఉండాలని అపోలో సీఈవో ఐవి రమణ పేర్కొన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బయటి ఆహారం కంటే ఇంటి భోజనం ఉత్తమమని, దుర వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం అపోలో ఆసుపత్రి నుంచి వివేకానంద పార్కు వరకు ర్యాలీ జరిగింది. ట్రాఫిక్ సీఐలు, 3వ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ, అపోలో డీజీఎం మూర్తి ఉన్నారు.



అపోలో హాస్పిటల్స్ నిర్వహించిన ర్యాలీ

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

» పలుచోట్ల మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమాలు » పాల్గొన్న ప్రజానిధులు, అధికారులు



కార్పొరేషన్: లబ్ధిదారుల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, కమిషనర్ భావన



సర్పవరం జంక్షన్: అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 28: ప్రతీ ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలని అప్పుడే జీవితం ఆనందంగా సాగుతుందని ఇల్లు ఉంటే పెద్ద గౌరవమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించేందుకు గాను మన ఇల్లు - మన గౌరవం పేరిట కాకినాడ నగర పాలక సంస్థ, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన లబ్ధిదారుల అవగాహన సదస్సులో వనమాడి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన స్థలంలో ప్రతీ ఒక్కరూ గృహ నిర్మాణాలను చేపట్టుకోవాలన్నారు. కమిషనర్ భావన మాట్లాడారు. గృహ నిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ, ఈఈ వై.శ్రీనివాస్, డీఈ కెఎస్ఎన్ రెడ్డి, మెప్మా పీడీ ప్రియంవద, కాకినాడ నగరపాలక సంస్థ టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు ఉన్నారు.

సర్పవరం జంక్షన్: పేదల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. రమణయ్యపేట మండల కార్యాలయంలో మండల హౌసింగ్ ఏఈ నాగభూషణరావు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహించిన మన ఇల్లు-మన గౌరవం అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నానాజీ మాట్లాడారు. 2014-19 లో ఇల్లు నిర్మించుకుని బిల్లులు పొందని లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు జిల్లా హౌసింగ్ పీడీ సత్యనారాయణ తెలిపారు. ప్రత్యేక అధికారిణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, హౌసింగ్ ఈఈ వై.శ్రీనివాస్, ఎంపీపీ బిందిలి వీరిష, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, కూటమి నాయకులు కరెడ్ల గోవిందు, నందిపాటి త్రిమూర్తులు ఉన్నారు.

కొత్తపల్లి: నిరుపేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. ఎండపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి అసంపూర్తి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. హౌసింగ్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గండేపల్లి: నిర్మాణంలో ఉన్న గృహాలన్నీ కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని బిల్లులు కూడా సకాలంలో ఇస్తామని మండల స్పెషల్ అధికారి కరుణాకరావు అన్నారు. మురారి గ్రామంలో హౌసింగ్ ఏఈ బొల్లి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కరుణకరరావు, టీడీపీ నేత జాస్తి వసంత్, హౌసింగ్ ఈఈ గుప్తా హాజరయ్యారు.సర్పంచ్ కుక్కల ఆనందబాబు పాల్గొన్నారు.

తాళ్లరేవు: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన జగనన్న లేఅవుట్లలో గృహనిర్మాణ లబ్ధిదారులు వేగంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారిణి విజయశాంతి అన్నారు. చొల్లంగి పంచాయతీ కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యాలయంలో ఏఈ శ్రీనివాస రెడ్డి, టీడీపీ మండల కార్యదర్శి కాట్రు త్రిమూర్తులు, టీడీపీ గ్రామకార్యదర్శి గర్రే లక్ష్మీనారాయణ, గ్రామకమిటీ అధ్యక్షుడు పులపకూర త్రిమూర్తులు ఉన్నారు.

తుని రూరల్: పేదల సొంతింటి కల కూటమి ప్రభుత్వంతోనే నెరవేరుతుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తేటగుంట క్యాంప్ కార్యాలయంలో మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. హౌసింగ్ అధికారులు డీఈ వీఎస్ శ్రీనివాసరావు నాయుడు, ఎంపీడీవో రవికుమార్, మండల లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్ గీతాదేవి తదితరులున్నారు.

ప్రత్తిపాడు: సొంత ఇంటితోనే సుఖమయ జీవనం, గౌరవం నెలకొన్నాయని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ, జిల్లా నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ప్రత్తిపాడు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు చెప్పారు. ఒమ్మంగిలో బీసీ కార్పొరేషన్ ఈడీ.. ప్రత్తిపాడు,ధర్మవరంలో జరిగిన సమావేశాల్లో ఎంపీడీవో మన ఇల్లు- మన గౌరవం ఆవశ్యకతను వివరించారు. సర్పంచ్‌లు గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం, బెంతుకుర్తి సుశీల అబ్బాయిలు, ఎంఈవో వి.రాజబాబు, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్, స్థానక పెద్దలు బొల్లుకొండబాబు, కార్యదర్శులు ద్విభాష్యం శ్రీనివాసరావు, దడాల మహేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులను శిక్షించాలి



గండేపల్లి: దీక్షలో పాల్గొన్న ఎంపీ, తుమ్మలపల్లి

గండేపల్లి, సెప్టెంబరు 28: హిందువులు ఎంతో పవిత్రంగా తిరుమల శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన వైసీపీ నాయకులను వెంటనే శిక్షించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. శనివారం తాళ్ళూరు గ్రామం వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు ఎంపీ సంఘీభావం తెలిపి నిమ్మరసమిచ్చి దీక్ష విరమింపచేశారు. ఆలయాన్ని శుభ్రపరిచి సంప్రోక్షణ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి వర్మ, సర్పంచ్ శీలామంతుల వీరబాబు, ఉపసర్పంచ్ పైబ్రి వెంకటేశ్వరవు, మేడిబోయిన శ్రీను, సూరంపాలెం బాలు, పితాని వీరబాబు, అయిరాజు, రామకృష్ణ, రామ్‌దీపు, దొడ్డ శ్రీను, గంగాధర్ పాల్గొన్నారు.

పిఠాపురం: లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని వినియోగించడం ద్వారా వైసీపీ నేతలు తిరుమలను అపవిత్రం చేశారని ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయకుమార్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా పట్టణంలో ఉప్పాడ సెంటర్‌లో చేపట్టిన దీక్షలు శనివారం కొనసాగాయి. వారి దీక్షలకు అజయకుమార్, తంగెళ్లలు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు మద్దతు తెలిపారు.

'రాష్ట్రాభివృద్ధే ధ్యేయం'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 28: రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడపడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం రేచెర్లపేటలో 4,5,6,7,8,33 డివిజన్లకు సంబంధించి ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. వంద రోజులు పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతిని కొండబాబు వివరించారు. నగరపాలక సంస్థ అధికారులు, కూటమి నాయకులు మల్లిపూడి వీరు, ఎస్‌కె రహీమ్, అంబటి చిన్న, గుజ్జు సూర్యావతి లక్ష్మణరావు, మమతా శ్రీనివాస్, సీకోటి అప్పలకొండ, సంగిశెట్టి అశోక్, పోలిపల్లి జగన్, సోమాదుల గోవిందు, గంజా ఓంనమశ్శివాయ, సామంతుల నాగేంద్రప్రసాద్, ఏడిద శ్రీను, బొచ్చా దాసు, బొంతు సత్యనారాయణ, వడిసెల దాలమ్మ, వెంకటలక్ష్మి ఉన్నారు.

'అంగన్‌వాడీల అభివృద్ధికి చర్యలు'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 28: నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల పోషకాహార మాసోత్సవాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గర్భిణులకు సీమంతాలు, శిశువులకు అన్నప్రాసనలు ఎమ్మెల్యే నిర్వహించారు. ఎంపీడీవో కుమార్‌బాబు, ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీవో ఆర్‌వీఎస్ లక్ష్మి, సూపర్‌వైజర్లు రత్నం, వరలక్ష్మి, సూర్యకుమారి, చక్రం, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంపై నిరసన

కరప, సెప్టెంబరు 28: కరప సొసైటీలో శనివారం సంఘ మహాజన సభ రైతుల నిరసనతో రసాభసగా మారింది. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల సంఘానికి సంబంధించిన రూ.10 లక్షలు దుర్వినియోగమైందని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. 2010, 2020 నుంచి ఐటీ రిటర్న్ ఫైల్ చేయకపోవడాన్ని తప్పు పడుతూ ఐటీ శాఖ అధికారులు రూ.84 లక్షలు పెనాలిటీ విధించిందని దీనిపై ట్రిబ్యునల్‌కు వెళ్లిన అప్పటి పాలకవర్గం, సీఈవో సంఘ షేర్ ధనం నుంచి రూ.10 లక్షలను దుర్వినియోగం చేశారన్నారు. దీంతో పాటుగా ఖర్చుల పేరిట వేలాది రూపాయలు సంఘ నిధులు వినియోగించారని ఆరోపించారు. సంఘ భవనం, ప్రహరీ గోడ నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సంఘ అసిస్టెంట్ రిజిస్ట్రార్, పర్సన్ ఇన్‌చార్జి ఎస్.దుర్గాప్రసాద్,ఇన్‌చార్జి సీఈవో నక్కా మూర్తి ఉన్నారు.



కరపలో మహాజన సభ నిర్వహిస్తున్న పర్సన్ ఇన్‌చార్జి

పెద్దాపురం అభివృద్ధికి సహకరించాలి

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సామర్లకోట: సమావేశంలో మాట్లాడుతున్న రాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 28: తాను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేనైనా సామర్లకోట మండలంలో తన పట్ల ఎంతమాత్రం విలువలు పాటించలేదని తిరిగి గెలుపొందిన తాను నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెస్తానని పనులు అమలుకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ సత్తిబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజప్ప వివిధ శాఖల నిర్వహణ తీరుపై సమీక్షించి మాట్లాడుతూ మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన కేవలం వంద రోజులలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.25 కోట్ల మేర నిధులు మంజూరుచేయించి అభివృద్ధిని కొనసాగిస్తున్నామన్నారు. మండలంలో విద్యాశాఖ తీరు తిరోగమనంలో ఉందని ఎంఈవో శివరామకృష్ణయ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఉపాధి హామీ నిధులతో మండలంలో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మండల పరిషత్‌పాలకవర్గం నుంచి ఏకగ్రీవంగా తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. సమావేశంలో జడ్పీటీసీ ఎలిశెట్టి అమృతానరేష్, ఎంపీడీవో డి.శ్రీలలిత, తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఏవో మంగతాయారు తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి

పెద్దాపురం, సెప్టెంబరు 28: పట్టణాలు, గ్రామాల్లో ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్ప టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సుధా కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

గొల్లప్రోలు కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

నగర పంచాయతీ సమావేశాన్ని బహిష్కరించిన ఛైర్‌పర్సన్ సహా వైసీపీ కౌన్సిలర్లు



నగరపంచాయతీ సమావేశంలో కమిషనరు రవికుమార్‌ను నిలదీస్తున్న వైసీపీ కౌన్సిలర్లు

గొల్లప్రోలు, సెప్టెంబరు 28: పట్టణ పరిధిలో జరిగే ఏ విషయాన్ని తెలియచేయకుండా, ప్రోటోకాల్ పాటించకుండా కమిషనరు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఛైర్‌పర్సన్ సహా వైస్‌ఛైర్మన్లు, వైసీపీ కౌన్సిలర్లు నగర పంచాయతీ సమావేశాన్ని బహిష్కరించారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం ఛైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన ప్రారంభమైంది. వెంటనే వైస్‌ఛైర్మన్లు గంధం నాగేశ్వరావు, తెడ్లపు అలేఖ్యరాణితో పాటు వైసీపీ కౌన్సిలర్లు ఇటీవల 18వ వార్డులో జరిగిన వీధిలైట్లు, కుళాయిల ప్రారంభోత్సవాలపై ప్రస్తావించారు. ఛైర్‌పర్సన్, కౌన్సిలర్లుకు సమాచారం లేకుండా ఎలా నిర్వహించారని ప్రశ్నించారు. జూలైలో వీధిలైట్లు కొనుగోలుకు టెండర్లు పిలవాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేస్తే నామినేషన్ పద్ధతిపై ఎలా ఇచ్చారని నిలదీశారు. టెండర్లు ఎవ్వరు వేయకపోవడంతోనే నామినేషన్‌పై ఇచ్చామని తెలిపారు. వీధిలైట్లు ఎవరయినా స్పాన్సర్ చేశారా, నగరపంచాయతీ నిధులతో కొనుగోలు చేశారా అని ప్రశ్నించారు. నగర పంచాయతీ నిధులతోనే కొనుగోలు చేశామని ఏఈ ప్రభాకర్ తెలిపారు. ప్రోటోకాల్ పాటించకపోవడం ఏంటని కౌన్సిలర్లు కమిషనరును నిలదీశారు. సమాచార లోపంతో పొరపాటు జరిగిందని, క్షమించాలని కమిషనరు కోరినా వారు పట్టించుకోలేదు. దీంతో సుమారు గంట పాటు సమావేశం స్తంభించింది. కమిషనరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైసీపీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌కు లేఖ ఇచ్చారు. అనంతరం కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు, వైసీపీ కౌన్సిలర్లు ప్రకటించి వెళ్లిపోయారు. దీంతో సమావేశం అర్ధాంతరంగా వాయిదా పడింది. కమిషనరును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నగరపంచాయతీ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఛైర్‌పర్సన్ సహా కౌన్సిలర్లు ధర్నా నిర్వహించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది.

జనసేన నేతల ఆగ్రహం

వీధిలైట్లు వెలగక పట్టణమంతా అంధకారంలో చిక్కుకుంటే సమస్యను సత్వరం పరిష్కరించిన పంచాయతీ అధికారులను అభినందించకుండా, వారిని తప్పుపడుతూ చర్యలు తీసుకోవాలని నగరపంచాయతీ వైసీపీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేయడంపై జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం వద్ద వారు శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమావేశంలో జనసేన నేతలు కడారి తమ్మయ్యనాయుడు, పర్ల రాజా, బలిరెడ్డి గంగబాబు, బస్వా చిట్టిబాబు, మామిడాల దొరబాబు, జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సూపర్ బజార్ డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నిక



మాట్లాడుతున్న సూపర్ బజార్ సీఈవో

కాకినాడ సిటీ, సెప్టెంబరు 28: ది కాకినాడ కన్స్యూమర్స్ మల్టీ ఎయిడెడ్ కోపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్ బజార్) ముగ్గురు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మెయిన్‌రోడ్‌లోని ప్రధాన కార్యాలయంలో 61వ మహాజన సభ సీఈవో వి.శివాజీ గణేష్ అధ్యక్షతన జరిగింది. పదవీ విరమణ పొందిన ముగ్గురు డైరెక్టర్ల స్థానంలో ప్రెసింగి ఆదినారాయణ, బి.బాలకృష్ణ, దాలిపర్తి ఆదినారాయణ డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ సహకార అసిస్టెంట్ రిజిస్ట్రారు ఆర్.సుధాకరరావు వ్యవహరించారు. పదవీ విరమణ పొందిన ఛైర్మన్ ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు కందాళ కనకదుర్గ నాగసీతామహాలక్ష్మి, రావూరి వెంకటేశ్వరరావులను సత్కరించారు. సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్ వరిపల్లి కృష్ణవేణి, డైరెక్టర్లు మన్నె నాగేశ్వరరావు, యాళ్ల పట్టాభిరామయ్య, బత్తిన పైడిరాజు, ముమ్మిడి పవన్‌కుమార్, డీవీవీ ప్రసాద్, నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు ప్రెసింగి ఆదినారాయణ, బి బాలకృష్ణ, దాలిపర్తి ఆదినారాయణ సభ్యులు పాల్గొన్నారు.

నేలపై మధ్యాహ్న భోజనం!



కరప, సెప్టెంబరు 28: కరపలో మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఇలా ఆరుబయట కటిక నేలపై కూర్చుని భోజనాలు చేయడం విద్యార్థులకు నిత్యకృత్యమయ్యింది. భోజనాలు చేయడానికి ఒక షెడ్డును మంజూరు చేయాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు : డీఈవో

ఏలేశ్వరం, సెప్టెంబరు 28: చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని లింగంపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, రికార్డులను తనిఖీ చేసిన డీఈవో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విద్యార్థులందరూ తినేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.ఈశ్వరాయి, కె.వలక్ష్మీ, ప్రధానోపాధ్యాయురాలు సునీత, రామకృష్ణ ఉన్నారు.

'మహిళా మార్టుల అభివృద్ధికి కృషి'

కిర్లంపూడి, సెప్టెంబరు 28: ఆర్థికంగా మహిళలను ఆదుకునేందుకే వెలుగు మహిళా మార్టు ఏర్పాటు చేస్తున్నారని ట్రైనీ కలెక్టర్ భావన అన్నారు. కిర్లంపూడిలో వెలుగు మహిళా మార్టును శనివారం ఆమె సందర్శించారు. మార్టు నడుపుతున్న విధానం, సరుకులు అమ్మకాలు చూశారు. వినియోగదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మార్టులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. వెలుగు పీడీ కె.శ్రీరమణి, డీపీఎం బాబురావు, ఏపీఎం శ్రీనివాస్ ఉన్నారు.

సీఎం సహాయనిధికి విరాళాలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 28: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి బీజేపీ సీనియర్ నేత పైండా వెంకటనారాయణ రూ.1.5 లక్షల విరాళం చెక్కును కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు అందజేశారు. అదేవిధంగా శ్రియ జ్యూయలర్స్ అధినేత విశ్వేశ్వరరావు రూ.లక్ష విరాళం చెక్కును ఎమ్మెల్యే కొండబాబుకు అందజేశారు. శనివారం స్థానిక జగన్నాథపురంలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పైడా శ్రీనివాస్, పైడా రామకృష్ణ, పైడా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'టీకాలు వేయించాలి'

రౌతులపూడి, సెప్టెంబరు 28: పెంపుడు జంతువులకు యాంటీరాబీస్ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి ముద్రగడ వీరరాఘవరావు అన్నారు. రౌతులపూడి జిల్లా పరిషత్ పాఠశాల నందు ప్రపంచ రాబీస్ దినోత్సవాన్ని నిర్వహించారు. రాబీస్ వ్యాధి తీవ్ర లక్షణాలు చికిత్స నివారణపై విద్యార్థులను అవగాహన కల్పించారు. ఎంఈవో గాడి కొండబాబు, ప్రధానోపాధ్యాయుడు కోళ్ళ రాంబాబు ఉన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

తొండంగి, సెప్టెంబరు 28: వాకదారిపేట గ్రామంలో శనివారం ఒంటిమామిడి దివిస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన ఆవులు, గేదెలు, కోళ్ళు, మేకలు, గొర్రెలకు వైద్యపరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు. శృంగవృక్షం పశువైద్యాధికారి నర్సింగరావు, దివిస్ సీనియర్ మేనేజర్ సుధాకర్ సంస్థ ప్రతినిధులు బి.వాసుబాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఏఈగా శ్రీనివాస్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 28: ప్రత్తిపాడు ఎలక్ట్రికల్ ఏఈగా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గత రెండేళ్లగా ఈ పోస్టుఖాళీగా ఉండగా శ్రీనివాస్ జగ్గంపేట డీఈ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడ చేరారు. ఆయన్ని ఏడీఏ రాజశేఖర్, ఎలక్ట్రికల్ లైన్ ఎల్లయ్యలు, సిబ్బంది అభినందించారు.

భూ కబ్జాపై ఫిర్యాదు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 28: తాళ్లరేవు మండలం చిన్న గోవలంక పంచాయతీ పరిధిలోని 16 సెంట్ల పంచాయతీ భూమిని కొంతమంది ఆక్రమించారని, ఈ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలని చిన్న గోవలంక పంచాయతీ సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ శనివారం కాకినాడ ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి త్రినాథ్‌కు ఫిర్యాదు చేశారు.

జి.వేమవరంలో గ్రామసభ

తాళ్లరేవు, సెప్టెంబరు 28: శనివారం జి.వేమవరంలో సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ప్లాస్టిక్‌ను వినియోగించే వారికి రూ.10వేలు జరిమానా విధించనున్నట్టు పంచాయతీ తీర్మాణం చేసిందని, విధిగా అమలు చేస్తామని కార్యదర్శి సుధారాణి తెలిపారు.

భగత్‌సింగ్ జయంతి



కరప, సెప్టెంబరు 28: నడకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విప్లవ వీరుడు భగత్ సింగ్ జయంతిని హెచ్ఎం టి.మురళీ బాబు ఆధ్వర్యంలో యంగ మైన్స్ ఫౌండేషన్ ఛైర్మన్ వాకాడ వెంకటరమణ సహకారంతో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సేవలను కొనియాడారు. పీడీ డీవీ ఎస్‌లక్ష్మీకుమారి, కాంప్లెక్స్ ఇన్‌చార్జి వెంకటరమణ ఉన్నారు.

జగ్గంపేట సీఐగా శ్రీనివాస్

జగ్గంపేట, సెప్టెంబరు 28: జగ్గంపేట సీఐగా వైఆర్‌కె శ్రీనివాస్ రానున్నట్టు సమాచారం. 2,3 రోజుల్లో సీఐగా బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. గతంలో ఆయన జగ్గంపేట ఎస్ఐగా పని చేశారు.